వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శనివారం 20 జూలై 2024

జమాలుల్లా బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఏపీ రాష్ట్ర రవాణా యువజన క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలి

రాయచోటి, జులై 19, ప్రభాతవార్త:

ప్రతి ఇంటికి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి మండలం ఏపి లవంకపల్లి, గొర్ల ముదివీడు గ్రామంలో ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ట్రాక్టర్ ఎక్కడ వరకు వెళ్తే అక్కడ వరకు వెళ్లి నీటిని వదిలేలలా చూడాలని ఈఓపీఆర్డీకి తెలిపారు. త్వరలో కాలువలు మంజూరయ్యేలా చూస్తానని జిల్లా కలెక్టర్ గ్రామస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ ప్రసన్నకుమార్, ఈఓపీఆర్డీ, ఎంపీడీవో, వీఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలి

- మండలంలో నీటి సమస్య తలెత్తకూడదు - రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై 19, ప్రభాతవార్త :

అధికారులు పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేసి పేదల సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చిన్నమండెం మండల సమావేశ భవనంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో అభివృద్ధికి నోచుకోని చిన్నమండెం మండలంలో అధికారులు పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేసి పేదల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అధికారులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. మండలంలో నీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి పైపులైన లీకేజీ ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టిసి బస్సులు సకాలంలో నడపాలని, బస్టాండు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచి బస్టాండు నందు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవంతంగా నిర్వహిస్తోందని, ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పని చేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. అధికారులు ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు రాష్ట్ర ముఖ్యమంతి నారా చంద్రబాబునాయుడు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మెగా డిఎస్సీ ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దీపం పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అదే విధంగా డ్వాక్రా గ్రూపులు

ఏర్పాటు చేసి డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడం జరిగిందన్నారు. హౌసింగ్ అధికారులు ఇళ్లు లేని ప్రతి పేదవారికి ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని, ప్రస్తుతం వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో కుల మత ప్రాంత బేదాలు లేకుండా అధికారులు ప్రభుత్వ పథకాలు అమలు చేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఈఓ రమణారెడ్డి, ఎంపిపి సుధా మాధురి, ఎంపిడిఓ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌళిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి విఫలం

చిన్నమండెం, జూలై 19, ప్రభాతవార్త :

రాయచోటిలో గత 15 సంవత్సరాల నుంచి ఏ విధమైన అభివృద్ధి చెందిందో ప్రజలందరికీ తెలుసునని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి హయాంలో హంగు ఆర్భాటాలు తప్ప రాయచోటి ప్రాంతానికి ఏ విధమైన మౌళిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిపై తాను ఏ చర్చకైనా సిద్ధంగా ఉన్నానని అన్నారు. వైసిపి వారు రాయచోటిని జిల్లా కేంద్రం చేశామని సంకలు గుద్దుకుంటున్నారని, భౌగోళికంగా రాయచోటి అన్ని ప్రాంతాలకు దగ్గర ఉంది కాబట్టే జిల్లా కేంద్రంను చేయకలిగారని అన్నారు. జిల్లా చేసిన ప్పటి నుండి ఈరోజు వరకు రాయచోటికి ఎలాంటి మౌళిక సదుపాయాలు కల్పించలేదంటూ ఆరోపించారు. రాయచోటి జిల్లా కేంద్రం కాకముందే రింగ్ రోడ్డు ఉందన్నారు. జిల్లా ఏర్పాటు అయిన తర్వాత ఏ విధమైన నిర్మాణాలు చేపట్టలేదన్నారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోనే కొనసాగుతున్నాయని, కలెక్టర్, ఎస్పీ బంగ్లాలు, వివిధ జిల్లా శాఖలకు సంబంధించి కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. ఎక్కడా లేని విధంగా అందరూ ముక్కున వేలేసుకునే విధంగా ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకొని సుమారు 10 కోట్లు వ్యయంతో వైసిపి ఆఫీసును నిర్మిస్తున్నారని, అదే చొరవ, చనువు, ప్రేమ రాయచోటి ప్రజలపై ఉండి ఉంటే ఏ మౌళిక వసతులు కల్పించేందుకు ముందుకు వెళ్లేవారని ఆయన ఆరోపించారు. అవన్నీ పక్కనపెట్టి వైసిపి వారు ఆదాయాన్ని, ఆస్తులను పెంచుకున్నారని ధ్వజమెత్తారు. రాయచోటి మున్సిపాలిటి గ్రేడ్ వన్ కాబట్టి అక్కడికి వచ్చే నిధులుతో కొద్దో గొప్పో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గడిచిన 15 ఏళ్లలో రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కానీ, ఈ ప్రాంత వాసి అయిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కానీ రాయచోటి ప్రాంతానికి ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కోటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

పీలేరు, జూలై 19 ప్రభాతవార్తః

మండలంలోని కోటపల్లె లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ పాఠశాల నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకానికి చెందిన రిజిస్టర్, పాఠ్యాంశాల ప్లాన్ రిజిస్టర్ తదితర రిజిస్టర్‌లను పరిశీలించారు. పాఠశాలలో పిల్లలకు యూనిఫామ్, షూస్, స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, డిక్షనరీ, నోటుపుస్తకాలువంటి విద్యాసామగ్రి వచ్చాయా లేదా అని హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యాసామగ్రిని పిల్లలకు త్వరగా అందజేయాలని హెచ్ఎంనూ దేశించారు. టాయిలెట్ మెయింటెన్సు ఫండ్ ఉపయోగించి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులను సక్రమంగా నిర్వర్తించని ఎంఈఓ పద్మావతికి షోకాస్ నోటీసు జారీచేయాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. అనంతరం పదవతరగతి పిల్లల తరగతి గదికి వెళ్లి అక్కడి పిల్లలను ఆర్థికవ్యవస్థ పై పలు ప్రశ్నలను పిల్లలను అడిగారు. పిల్లల జవాబులతో జిల్లా కలెక్టర్ సంతప్తి చెంది ఇంకా బాగా చదవాలని విశ్లేషణాత్మకంగా ప్రశ్నలు వేసుకుని చదివితే ఇంకా బాగా అర్థమవుతుందని పిల్లలకు సూచించారు.

నేలపైన కూర్చుని విద్యార్థులతో భోజనం చేసిన కలెక్టర్ః

అనంతరం పాఠశాల పిల్లలతో కలిసి ఒక సామాన్యమైన వ్యక్తిల విద్యార్థులతో నేలపైన కూర్చొని మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు. భోజనం బాగుంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు. సొంత నిధుల నుంచి సైన్సు ల్యాబ్‌ను స్పాన్సర్ చేసిన జిల్లా కలెక్టర్... మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ పిల్లలతో కలిసి భోజనం చేసిన తరువాత పాఠశాల పిల్లలతో కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో వసతులు అన్ని బాగున్నాయా లేదా, పాఠాలు బాగా చెబుతున్నారా లేదా పాఠశాల సమస్యలు ఏమైనా ఉన్నాయా, వంటి ప్రశ్నలను పిల్లల్ని అడగగా పదవ తరగతికి చెందిన యువతేజ గురుచరణ్‌లు తమ పాఠశాలలో పాఠాలు బాగా చెబుతున్నారని, సైన్సు ల్యాబ్ ఏర్పాటుచేస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్‌కు తెలుపగా ,.. కలెక్టర్ తన నిధుల నుంచి స్కూల్ కి సైన్సు ల్యాబ్ ఏర్పాటు చేయిస్తానని పిల్లలకు తెలుపగా పిల్లలు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

చర్మ వ్యాధులతో బాధపడుతున్న హాస్టల్ విద్యార్థులు...

హాస్టల్ విద్యార్తులకు చర్మవ్యాధులు ప్రబలుతున్నాయని విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా వెంటనే వైద్య శిబిరం నిర్వహించాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారిని ఆదేశించారు. ఈతనిఖీలో జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, ఏడి ప్రసాద్‌బాబు, తహశీల్దారు మహబూబ్‌బాషా, పీలేరు మండల ఎంఈఓలు లోకేశ్వరరెడ్డి, పద్మావతి పాఠశాల హెచ్ఎంలు శివశంకరయ్య, బోధనా సిబ్బంది రామచంద్రయ్య, శేషాద్రిరెడ్డి, సురేంద్రరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఖాదర్‌బాష, సుదర్శన, స్వర్ణలత, జయచంద్రారెడ్డి, వసంతకుమారి, ఆంజిరెడ్డి, నాగసుబ్బయ్య, వెంకటరమణారెడ్డి, నాగరాజరెడ్డి, ద్వారకనాథ్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రొద్దుటూరు, జూలై 19, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో ఓపి బ్లాక్, ఐపీ బ్లాక్‌లను తనిఖీ చేసి స్వయంగా రోగులను ఒక్కొక్కరికి పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొదటగా క్యాజువాలిటి, ఓపీ బ్లాకులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులను పలకరించి వైద్య సేవలపై ఆరా తీశారు. బాలింతల వార్డులు, కాన్పుల వార్డు, పురిటి నొప్పుల గర్భవతుల వార్డులను పరిశీలించి ఆసుపత్రి యాజమాన్యం కల్పిస్తున్న వసతులు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డులో అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా? నర్సింగ్ సిబ్బంది ఏమైనా కొరత ఉందా? అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పేషంట్లతో పాటు వారి అటెండెంట్లకు సుచికరమైన భోజన సదుపాయంపై ఆరా తీశారు. ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎం సిబ్బంది సమస్యలపై ఆయన స్పందిస్తూ త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సరైన భోజనం అందుతోందని, వసతులు కూడ బాగా అందుతున్నాయని రోగులు వారి అటెండెన్స్ జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లను పలకరిస్తూ ఆయన నెల నెల జీతాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రత్యేక నవజాత శిశు వార్డు, కంగారో వార్డులను పరిశీలించి అక్కడ వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌డీయూ యూనిట్‌ను పరిశీలించి రోగులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండో ఫ్లోర్‌లోని డెంటల్, చిన్న పిల్లలు, మెడికల్ వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో మౌళిక వసతులు, వాతావరణం, పారిశుద్ధ్యం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరిండెంట్‌తో ఆసుపత్రి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జమ్మలమడుగు ఆర్డిఓ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు మున్సిపల్ కమీషనర్ రఘునాథరెడ్డి, ప్రొద్దుటూరు తహసీల్దార్ విద్యాసాగర్, ఆసుపత్రి సూపరిండెంట్ డా.ఆనంద్‌బాబు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులలో బదిలీల బాధ - డిప్యూటీలుగా ఇన్‌చార్జుల ఆశ

- ఒకే కార్యాలయంలో పెద్ద చిన్న అధికారుల పోటీ - రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

రాజంపేట,జులై 19,ప్రభాత వార్త :

ప్రభుత్వ శాఖల్లో పని చేసే అధికారులకు బదిలీల బాధ బాగా వేదిస్తోంది. వీరు ఇలా ఉంటే వారి క్రింద పని చేసే డిప్యూటీ అధికారులు ఇన్‌చార్జులుగా నియమించుకునేందుకు ఆశపడుతున్నారు. దీంతో ప్రతి కార్యాలయంలోనూ పెద్దా చిన్న అధికారుల మధ్య తీవ్ర స్థాయిలో అంతర్గతంగా పోటీలు నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ అధికారాల కోసం ఎవరి పంథాలో వారు రాత్రింబవళ్లు పడిగాపులు కాచి రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఎన్నికల సమయాల్లో ఒక జిల్లాలో ఉన్న అధికారులను మరొక జిల్లాలకు అన్నిశాఖల వారికి సంబంధించిన వారికి ప్రభుత్వం బదిలీలు చేయడం జరుగుతుంది. అందులో బాగంగానే ఇటీలవ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అన్నిశాఖల్లో అధికారులను బదిలీ చేయడం జరిగింది. అయితే ఎన్నికలు ముగియగానే తిరిగీ బదిలీపై వచ్చిన అన్ని శాఖల అధికారులు వారి వారి ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. కేవలం 3 నాలులు నెలలకే పొరుగు జిల్లాల నుండి వచ్చిన అధికారులు ఇక్కడ ఏ మేరకు అవినీతి అక్రమాలు చేసి లాభాలు గడించారో తెలియదు గానీ ఇక్కడి నుండి వెళ్లడానికి సముఖత చూపడం లేదు. ఇదే ప్రాంతంలోనే ఐదేళ్లపాటు పని చేసి అధికారులు కూడా అంతో ఇంతో వెనుకేసుకునేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. దీంతో స్థానిక రాజకీయ నాయకుల వద్దకు వంగు దండాలతో వెళ్లి మమల్ని ఇక్కడే ఉంచితే మీరు ఏమి ఆదేశిస్తే తప్పు ఒప్పు అని చూడకుండా చేప్పినట్లు చేస్తామని కూడా నాయకులను బంగపడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇవి ఒకటి రెండు కార్యాలయాల్లో కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఎలా ఉందో తెలియదు గానీ ఉమ్మడి కడప జిల్లాలోని అధికశాతం కార్యాలయల్లో ఇలా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అవసరం వస్తే ముందే కొంత మంది ముట్టజెప్పేందుకు కూడా వెనుకాడనట్లు తెలుస్తోంది. వీరి బాధలు ఇలా ఉంటే అదేకార్యాలయాల్లో పని చేసే క్రింది స్థాయి అధికారులు బదిలీ పై వచ్చిన అధికారులను పంపించి ఇన్‌చార్జులుగా డిప్యూటీ వేయించుకుంటే సర్వం దేచిపెడతామని కూడా చోటా మోటా నాయకుల ద్వారా అధినాయకులకు చెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే అసలు అధికారుల కంటే డిప్యూటీ అధికారులు రెండింతలైనా ఖర్చు చేసి ఇన్‌చార్జుల బాధ్యతలు పొందేందుకు సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పెద్ద స్థాయి నాయకులకు అనుకూలంగా ఉన్నా చోటా మోటా నాయకులు కూడా పనులు చేయిస్థామని బదిలీలు ఆపుతామని, ఇన్‌చార్జులుగా నియమిస్థామని కూడా వారి నుంచి కొంత మేర దండుకుంటున్నట్లు కూడా తెలుస్తోంది.

రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచుకోవాలి

కడప క్రైం, జులై 19, ప్రభాతవార్త:

రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఖచ్చితమైన సమాచారం వచ్చేలా సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, ఇన్‌స్పెక్టర్ యు.వెంకట కుమార్, జిల్లాలోని ఎస్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటువంటి సమస్యలు వచ్చినా

వైకాపా వారికి అండగా ఉంటాం

పులివెందుల, జూలై 18, ప్రభాతవార్త ః

అన్నపూర్ణలాంటి ఆంధ్ర రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు, అతని కుమారుడు నారా లోకేష్ రెడ్ బుక్ పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ బీహార్ రాష్ట్రం కంటే దారుణంగా మార్చుతున్నారని వైఎస్ఆర్ కడప జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు గురైన వైకాపా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి ధైర్యం చెప్పాలన్న ఆదే శాల మేరకు పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండల కేంద్రంలో తెదేపా వారి చేతిలో దాడులకు గురైన అబ్బాస్, ప్రతాప్‌రెడ్డి, వల్లిల ఇళ్లవద్దకు వెళ్లి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా అన్నివిధాలా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చి ధైర్యాన్ని నింపారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ సీఎం, ఆయన తనయుడు నారాలోకేష్‌లు రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. ఎక్కడ చూసినా కిరాతకంగా పైశాచిక దాడులు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు స్పందించి పాలనను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. మొన్న వినుకొండలో రషీద్‌ను అత్యంత దారుణంగా చంపివేయడం దారుణం అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా తెదేపా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ వెన్నపూస రామమోహన్‌రెడ్డి, వి.రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించి జేసీ, ఆర్డీఓ

దువ్వూరు, జూలై 19, ప్రభాతవార్త:

స్థానిక తెలుగు గంగ బంగ్లా వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న పెట్రోల్ బంక్ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఆర్డిఓ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ స్థలాలలో ఇటివల పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుచేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధం అయ్యారు. అందులో బాగంగా తెలుగు గంగ బంగ్లా వద్ద ఉన్న రెవెన్యూ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. అందులో బాగంగా జేసీ, ఆర్డీఓ పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించారు. తదుపరి నివేదిక ఇవ్వవలసిందిగా తహసీల్దార్ ఉమారాణికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణికి రోడ్డు, భవణాల శాఖ ఏఈ రజియా పుల్లారెడ్డి పేట నుండి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా రోడ్డు, భవణాల శాఖ స్థలం ఏ మేరకు ఉందో కొలతలు వేసి ఇవ్వవలసిందిగా ధరఖాస్తును అందజేశారు. ఈ విశయంపై మండల సర్వేయర్‌కు గ్రామ సచివాలయం సర్వేయర్లకు ఆదేశాలు జారీ చేసి హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు , జూలై 19, ప్రభాతవార్త :

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శివ శంకర్‌ను కలెక్టర్ చాంబర్‌లో బద్వేలుమాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయ కర్త రితేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు రోశన్నలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ మేరకు వారు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధిపై చేపట్టాల్సిన అంశాల గురించి ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డిలు మాట్లాడుతూ కలెక్టర్‌ను కలిసి బద్వేలు నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే బద్వేలు పర్యటనకు రావాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలోని అన్ని ప్రాంతాలను సందర్శించి నెలకొన్న సమస్యలను పరిష్కరించడం అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యేలా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏన్‌డీఏ కూటమి అభ్యర్థి రోశన్న, టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి, ఎస్‌బీఐఆర్ కళాశాల ఏవో సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ

బద్వేలు, జూలై 19, ప్రభాతవార్త :

బద్వేలు నియోజకవర్గం గోపవరం మండల పరిధిలోని సాయికృష్ణ ట్రేడర్స్ పురుగు మందుల షాపును వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈమేరకు ఆయన రికార్డులను పరిశీలించి పురుగు మందు నమూనాను సేకరించి నాణ్యత పరీక్ష కేంద్రంకు విశ్లేషణ నిమిత్తం పంపడం జరిగిందన్నారు. అలాగే ఇది నకిలీదని తేలితే చర్యలు చేపడతామన్నారు. అలాగే ప్రతి దుకాణదారుడు రికార్డు స క్రమంగా నిర్వహించాలని ఎరువుల ధరల పట్టిను తెలపాలన్నారు.

ఘనంగా 34వ ఆరాధన మహోత్సవం

ప్రొద్దుటూరు క్రైం, జులై 19, ప్రభాతవార్త:

మండలంలోని ఉప్పరపల్లె ఆశ్రమంలో శుక్రవారం శ్రీ సమర్థ నారాయణ మహారాజుల వారి 34వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ ప్రతాప మారుతీ వారికి ఏకాదశ వార రుద్రాభిషేకం, గోపూజ, అన్నపూర్ణ పూజ, నామ భజన, విశేష అభిషేక అర్చనలు, గొప్ప అన్నదానంతో ఆరాధన మహోత్సవం ముగిసిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భకక్తులు పాల్గొన్నారు.

నాటకీయ పరిణామాల మధ్య మండల మీట్ వాయిదా

కురబలకోట, జులై 19 ప్రభాతవార్త :

కురబలకోట మండల సర్వసభ్య సమావేశం నాటకీయ పరిణామాలతో శుక్రవారం మరోసారి వాయిదా పడింది. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశం టిడిపి శ్రేణులు అడ్డుకోవడంతో రెండవ సారి వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలందరికి హాజరుకావాలని లేఖలు పంపారు. మొదట వైస్ ఎంపిపి రమణారెడ్డి, ఎంపిటిసిలు వైజి సురేంద్ర, రవీంద్రారెడ్డి,తెట్టు సుశీలమ్మ, నరసమ్మలు మినిట్స్ బుక్‌లో సంతకాలు తీసుకొని సమావేశం నిర్వహిస్తుండగా టిడిపి శ్రేణులు అడ్డుకొని ఎంపిపిని సమావేశానికి రప్పించి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎంపిటిసిలు ఎవరూ లేకుండా సంతకాలు తీసుకొని ఎలా నిర్వహిస్తారని వాయిదా వేయాలని పట్టుపట్టి వాగ్వివాదానికి దిగడంతో ఎంపిడిఓ హరి నారాయణ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది చెబుతామన్నారు. ఎంపిడిఓ కార్యాలయం ఎదుట టిడిపి శ్రేణులు నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, పార్లమెంటు బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్, వైజి. రమణ, మాజీ ఎంపిపి శీతిమల్‌రెడ్డి,ఎల్లారెడ్డి, కామకోటి ప్రసాద్‌రావు, చంద్రశేఖర్‌రాజు, వెంకటరమణా రెడ్డి, రెడ్డిశేఖర్, ఎస్.షామీర్, సర్పంచ్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై భర్త, కుటుంబసభ్యులపై భార్య ఫిర్యాదు

నిమ్మనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

అదనపు కట్నం కోసం ఓ ఇల్లాలు భర్త, తమ కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ కథనం మేరకు అదనపు కట్నం కోసం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయితీ ఎర్రాతివారిపల్లెకు చెందిన ఉషారాణికి చంద్రగిరి మండలానికి చెందిన శివతో 2022లో వివాహం జరిగింది. అప్పటి నుంచి తనను సక్రమంగా చూసుకోకపోవడం అదనపు కట్నం తేవాలని చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు భార్య ఉషారాణి తెలపడంతో భర్తతో పాటు సుబ్రమణ్యం, కస్తూరి విజయకుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి హామీ పథకం పనులపై తనిఖీ

రామసముద్రం, జులై 19 ప్రభాతవార్త :

మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన వివిధ పనులు, వాటి ఖర్చులపై అన్నమయ్యజిల్లా పిఓ మద్దిలేటి ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. గడిచిన 2023ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరువరకు జరిగిన పనులపై తనిఖీ చేశారు. వివిధ పనులకు సంబంధించి మొత్తం 1620 పనులకు గాను రూ.5.92కోట్లు ఖర్చు చేసినట్లుగా పిఓ తెలిపారు. అలాగే పండ తోటల పెంపకంలో చెట్లు చనిపోయిన వాటిలో 68547రుపాయలు లబ్దిదారుల నుండి ఉపాధిహామీ సిబ్బంది నుంచి రూ.38942లు పంచాయితీరాజ్ నుండి రూ.6875లు మొత్తం రూ.114364 రికవరీ చేసినట్లు పిఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రకాస్, ఎంపిడిఓ భానుప్రసాద్, ఎంపిపి కుసుమకుమారి, ఏపిఓ గౌరీశంకర్, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తోంది

వేంపల్లె, జూలై 18, ప్రభాతవార్త ః

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు, మానభంగాలు, హత్యలు నిత్యకృత్యాలుగా తయారయ్యాయని తెలిపారు. గత పాలనలో అరాచక ఆంధ్రప్రదేశ్ అయిందని, ప్రజలు ఆ పాలనకు స్వస్తి పలికి, కూటమికి అధికారం ఇచ్చారన్నారు. అయితే కూటమి పాలనలో శాంతి భద్రతలు మరింత క్షీణించాయని తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వెంటనే శాంతి భద్రతలపై దృష్టి సారించాలని, లేకుంటే జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే టీడీపీ కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా ఈనెల 15న అన్నాక్యాంటిన్లు ఏర్పాటు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని గ్రామీణ, పట్టణ విద్యార్థులకు అమలు చేస్తున్నట్లుగానే, అన్నా క్యాంటిన్లు కూడా గ్రామీణ, పట్టణ పేదలకు అందుబాటులోకి రావాలని సూచించారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

ముద్దనూరు, జూలై 19, ప్రభాతవార్త:

ముద్దనూరు టౌన్ నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను మరియు సెయింట్ క్లేవియర్స్‌యూపి మరియు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను మెడికల్ అధికారి శ్రీకాంత్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, వంటగది, పరిసరముల పరిశుభ్రత మరియు మంచినీటి వసతులు పరిశీలించి ఈ సీజన్‌లో వచ్చు అంటు వ్యాధులు, అవి రాకుండా తీసుకొను జాగ్రత్తలు గురించి, స్టాప్ డయేరియా ప్రోగ్రాం గురించి, నేషనల్ వెక్టార్ బోర్న్ వ్యాధుల కంట్రోల్ గురించి అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమానికి మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులురెడ్డి, సూపర్‌వైజర్ శోభా కుమారి, ఏఎన్ఎంలు ఇందిరా, ముస్కాన్ బి, ఎంఎల్‌హెచ్‌పీ యశ్వంత్, నరసయ్య, ఆశాలు, అంగన్వాడీ టీచర్స్, జడ్పీహెచ్ బాలికల హైస్కూల్ హెడ్ మాస్టర్, టీచర్స్, జడ్పీహెచ్ బాలుర హైస్కూల్ హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, జూలై 18, ప్రభాతవార్త ః

అన్నమయ్య, కడప జిల్లాల పూర్వ డీఈవోగా పనిచేసిన వై.రాఘవరెడ్డి అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు కడప జిల్లా శాఖ విచారణ అధికారి ప్రసన్నకుమార్‌ను ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి, బాధిత ఉపాధ్యాయులు సనావుల్లా, అంగడి నాగేంద్ర, తదితరులు కలిసి మాట్లాడారు. గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్నమయ్య జిల్లా డీఈవోగా ఉన్నప్పుడు రాఘవరెడ్డి అనర్హులను ఓటర్లుగా నమోదు చేయించారని, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు, స్కూల్ అటెండర్లను, నర్సరీ టీచర్లను కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేయించడం జరిగిందన్నారు. అలాగే 2023 జూన్ నుండి 2023 డిసెంబరు మధ్య కాలంలో రివర్షన్ పేరుతో అక్రమ బదిలీలకు తెరలేపి లక్షలాది రూపాయలు వసూలు చేశారని, అధిక హెచ్‌ఆర్ఏ ప్లేసుల్లో వారికి ప్లేస్‌మెంట్ ఇచ్చారని, ఎస్టీయూ ప్రతినిధులు విచారణాధికారికి ఆధారాలతో సహాయ నివేదించారు. రాష్ట్రోపాధ్యాయ సంఘ నేతలైన పి.సనావుల్లా, అంగడి నాగేంద్ర ప్రయోజనాలు దెబ్బకొట్టేలా వారి పదోన్నతులు దక్కకుండా అక్రమంగా డీఈవో పదవి ద్వారా అడ్డుకున్నాడని, దీనిపై విచారించి వారిద్దరికీ న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఎస్టీయూ ప్రతినిధులు 63 పేజీల నివేదిక ద్వారా విచారణ అధికారిని కోరారు.

ఆర్టీసీ బస్టాండు ఇన్, ఔట్ అప్రోచ్ పనులు ప్రారంభం

వేంపల్లె, జూలై 18, ప్రభాతవార్త ః

వేంపల్లెలోని ఆర్టీసీ బస్టాండు ఇన్, అవుట్ రహదారి అప్రోచ్ పనులు అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై ఇటీవల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు పనులు ప్రారంభించారు.

అడవి పందుల హల్‌చల్

వేంపల్లె, జూలై 18, ప్రభాతవార్త ః

వేంపల్లె సమీపంలోని పంట పొలాల్లో గురువారం రాత్రి అడవిపందులు హల్‌చల్ చేశాయి. రైతులు రామగంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలకు చెందిన నాలుగు ఎకరాల అరటిపంటను పందులు నాశనం చేయడంతో దాదాపు రూ.6లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

తొండూరు, జూలై 18, ప్రభాతవార్త ః

తొండూరు పరిధిలోని షిర్డిసాయి ఆలయంలో ఈనెల 21వ తేదీ ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. గురుపౌర్ణమి కార్యక్రమాలలో భాగంగా ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఉత్సవమూర్తి గ్రామోత్సవం చేస్తామన్నారు. భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు నిమ్మనపల్లె మండల మీట్

నిమ్మనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11గంటలకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరగనున్నట్లు ఎంపిపి నరసింహులు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరు కానున్నారు.

కోడూరు సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి

రైల్వేకోడూరు,జులై 19,ప్రభాతవార్త:

రైల్వేకోడూరు నియోజకవర్గ ఎన్నికలలో ఇచ్చిన హామీలు గురువారం మంగళగిరిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి చర్చించినట్లు ఆయన తెలిపారు.ముఖ్యంగా విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం ఉదయం ఎన్నికలలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడుతో చర్చించారు. ముఖ్యంగా రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్,గాలేరి నగరి కాలువ,రోడ్లు,బిల్డింగులు సమస్యలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,కోడూరు టు వెంకటగిరి రోడ్లు అభివృద్ధిపై ముఖ్యమంత్రితో చిర్చించగా సానుకూలంగా స్పందించినట్లు రూపానందరెడ్డి తెలిపారు.ముఖ్యంగా వైసిపి పాలన నిరంకుశంగా అభివృద్ధిని మరిచి కాలయాపన చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కిరించారని ఆయన అన్నారు.ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నార చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీ అమలు చేయడంలో ఆయనకు మించిన నేతలు లేరని ఆయన అన్నారు.రానున్న రోజుల్లో రైల్వేకోడూరు ఐదు మండలాలలో అభివృద్ధిని చేసి చూపెడతామని అన్నారు.ఈ సమావేశంలో ఆయన కుమారుడు రాష్ట్ర తెలుగు యువత నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు రేంజ్ డీఐజీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

కడప క్రైం, జులై 19, ప్రభాతవార్త:

కడప జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.హర్షవర్ధన్‌రాజు శుక్రవారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్కను అందజేశారు.

పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయాధికారి

పెండ్లిమర్రి, జులై 19, ప్రభాతవార్త:

మండలంలోని చెన్నమరాజుపల్లి గ్రామంలో శుక్రవారం నాగేశ్వర్‌రెడ్డి అనే రైతు పత్తి పంటను జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. పత్తి పంటలో పేను బంక, పచ్చదోమను నివారించడానికి ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో నీమాస్రంను పిచికారి చేయించడం జరిగింది. అనంతరం ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి రామకృష్ణమరాజు, మండల వ్యవసాయాధికారి చిన్న ఓబులేసు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన బోనమల

రాయచోటి, జులై 19, ప్రభాతవార్త:

విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా క్రీడా యువజన శాఖామంత్రి నాయకత్వంలో నారా లోకేష్‌ను మరియు తెదేపా జాతీయ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం రాయచోటి టీడీపీ పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ మర్యాదపూర్వకంగా కలిశారు.

చిన్న శేష వాహనంపై సిద్ధేశ్వరుడు

రాజంపేట అర్బన్, జూలై 19, ప్రభాతవార్త:

తాళ్లపాకలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం ఉదయం సిద్ధేశ్వర స్వామికి, చెన్నకేశవ స్వామి వారికి పల్లకి సేవ జరిగింది. సాయంత్రం సిద్ధేశ్వర స్వామి చిన్న శేష వాహనంపైన, చెన్నకేశవ స్వామి సింహ వాహణంపైన తాళ్లపాక మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. పెనగలూరు, రాజంపేటకు చెందిన జ్యోతి, రెడ్డి లక్ష్మి, సుభాషిణీ బృందాలు కోలాట ప్రదర్శనలతో అలరించారు. రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మోహన్ రావు తన కుటుంబ సభ్యులతో కలిసి సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వామి వారిని దర్శించి ప్రత్యేకమైన పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక సమూహ దేవాలయాల ఇన్స్‌పెక్టర్ బాలాజి, గురుస్వామి యాదవ్, వినోద్‌కుమార్, టిటిడి విజిలెన్స్ నిఘా విభాగ ఇంచార్జ్ గంగులయ్య, సర్పంచ్ శ్యామనబోయిన గౌరీ శంకర్, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపిబాబు, ఆర్ స్వామి నాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని కార్యమ్రాలను జయప్రదం చేశారు.

రేపు గురుపౌర్ణమికి సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పీలేరు,జూలై 19 ప్రభాతవార్తః

శ్రీషిరిడిసాయి బాబా టెంపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీశ్రీశ్రీషిరిడిసాయిబాబాకు ఉదయం 6గంటలకే అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించబడుని ఆలయ అర్చకులు , కమిటీ సభ్యులు తెలిపారు. ఈఅవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని దేవుని కపకు పాత్రులు కాగలరని కోరారు. గురుపౌర్ణమిరోజు దేవుని ఆరాధిస్తే సత్ఫలితాలు సంతోషం కలుగుతుందని తెలిపారు.

షిఫ్టు ఆపరేటర్లకు అవగాహన సదస్సు

పీలేరు, జూలై 19 ప్రభాతవార్తః

పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గంలో ఎంఎన్ఆర్ గార్డెన్స్ నందు శుక్రవారం పీలేరు డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్ కేవి ఉపకేంద్రం నందు పనిచేయు షిఫ్టు ఆపరేటర్లకు అవగాహన సదస్సు కల్పించారు. టీఆర్ఈయం అండ్ పి విభాగం వారు సబ్‌స్టేషన్‌లో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్, బ్రేకర్సు స్పందించి వివరముగా అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఈ డిఈఈ మండల ఎంఆర్‌పీ డీఈఈ మరియు ఆపరేషన్ బీఈఈలు, ఏఈలు ఏఈఈలు ఆపరేటర్లు పాల్గొన్నారు.

వాసవిమాతకు భక్తి శ్రద్ధలతో చీరె.. సారె

పులివెందుల రూరల్, జూలై 18, ప్రభాతవార్త ః

పులివెందులలో వెలసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఆర్యవైశ్యులు చీరె.. సారె సమర్పించారు. ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా సాయంత్రం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుండి అమ్మవారిశాల వరకు పండ్లు, మిఠాయిలతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం ఉత్సవ మూర్తికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు లలితా సహస్రనామ పారాయణము, కుంకుమార్చన, ప్రాకారోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను గోరింటాకుతో అలంకరించి భక్తులకు దర్శింపచేశారు.

జయమ్మకాలనీలో నీటి సమస్యను పరిష్కరించండి

పులివెందుల, జూలై 18, ప్రభాతవార్త ః

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బాకరాపురం జయమ్మ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ ఎస్సీ మోర్చ కడప జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు కోరారు. పులివెందుల మున్సిపల్ కమీషనరు రమణారెడ్డిని శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. మూడు రోజులుగా నీరు రాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

దువ్వూరులో ఒక మోస్తారు వర్షం

దువ్వూరు, జూలై 19, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోనూ చుట్టుప్రక్కల గ్రామాల్లోను గురువారం రాత్రి నుండి ఒక మోస్తరు వర్షం పడుతుంది. ప్రస్తుతం పడుతున్న వర్షాల వల్ల రైతులు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం అవుతున్నారు. అందులో భాగంగా కొంతమంది రైతులు మినుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేస్తున్నారు. కేసీ కాలువ ఆయకట్టు కింద పచ్చి రొట్టె విత్తనాలు సాగు చేయాలంటే కాలువ నీటి విశయంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో కేసీ రైతులు శ్రీశైలం ప్రాజెక్టు నీటిపై అంచనా వేసుకుంటున్నారు. ఏది ఏమైన రెండు రోజులు నుండి పడుతున్న వర్షాల వ్లల గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. అలాగే రైతులు తమ వ్యవసాయ పనులను ముమ్మరం చేస్తున్నారు.

ఎంపీ మిధున్ రెడ్డిపై దాడి అమానుషం

రాజంపేట అర్బన్, జూలై 19, ప్రభాతవార్త:

రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు దాడి చేయడం అమానుషం అని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన తర్వాత నియోజకవర్గ పరిధిలో పర్యటనకు వచ్చిన ఎంపీపై దాడులకు దిగడం సరికాదన్నారు. మిధున్ రెడ్డి పై దాడి సంఘటనను పరిశీలిస్తే ఎంత అరాచకంగా వ్యవహరించారో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి సంఘటనలు ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. రాష్ట్ర హోం మంత్రి పదే పదే రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కానీవమని ఒకవైపు చెబుతున్న ఇలాంటి సంఘటనలు జరుగుండటం శోచనీయం అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం అభివృద్ధి, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు ప్రయత్నించాలని కోరారు. అంతే తప్ప ఇలాంటి సంఘటనలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై దాడిని కూడ రఘునాథ రెడ్డి ఖండించారు.

ఎన్నికల్లో బదిలీ అయిన తహసీల్దార్లు యదా స్థానాలకు

రాజంపేట అర్బన్, జూలై 19, ప్రభాతవార్త:

ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీ కాబడిన తహసీల్దార్లు తిరిగి వారి వారి స్థానాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి సిసోడియా శుక్రవారం జీవో జారీ చేశారు. సోమవారంలోగా తాసిల్దార్లు బాధ్యతలు స్వీకరించనున్నారను. ఈ బదిలీల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి సాధారణ బదిలీలు ఉంటాయని తెలుస్తోంది.

ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

బద్వేలు అర్బన్, జూలై 19, ప్రభాతవార్త :

ఆషాడమాసం పురస్కరించుకుని పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో వెలసిన శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మఅమ్మవారికి వివిధ ప్రత్యేక కూరగాయలతో చేపట్టిన శాకంబరి దేవి అలంకారం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం తెల్లవారుజామునుంచే భక్తులు భక్తి,శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని టెంకాయలు కొట్టారు. ఆలయ కమిటి సభ్యులు పబ్బతి చంద్రశేఖర్, నాగభూషణం , సుబ్బరాజాతో పాటు కమిటి సభ్యులు భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మిధున్‌రెడ్డి వాహనాలపై దాడి హేయమైన చర్య

బద్వేలు అర్బన్, జూలై 19, ప్రభాతవార్త :

వైఎస్సార్ ఎంపీ మిథున్ రెడ్డి వాహనాలపై దాడి హేయమైన చర్య అని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలచే ఎన్నుకోబడిన పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డి పుంగనూరు పర్యటనలో భాగంగా దళితుడైన మజీ ఎంపీ రెడెప్ప ఇంటికి వెళ్లగా టీడీపీకి చెందిన వందలాది మంది రాళ్లతో దాడిచేసి వాహనాలను ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని అభివర్ణించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటికి దాడులు, హత్యలు, ఆస్తుల ధ్వంసం అధికమయ్యాయని, శాంతిభద్రతకు విఘాతం కలుగుతోందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బాధ్యత పోలీసులు త

పాల బిల్లులు చెల్లించాలంటూ రైతులు ధర్నా

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

పాల బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని రైతులు శుక్రవారం అమూల్ డైరీ వద్ద ధర్నా నిర్వహించారు. బెంగుళూరు రోడ్డులోని అమూల్ డైరీ వద్ద బిల్లు బకాయిలు ఉన్న రైతులు నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా తమకు పాలబిల్లులు ఇవ్వకుండా అమూల్ డైరీ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలతోనే జీవనం పొందే తమకు బిల్లులు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి బిల్లులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డెయిరీ మేనేజర్ మాట్లాడుతూ బకాయిలున్న రైతులందరికి బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకొంటామని చెప్పడంతో రైతులు శాంతించారు.

ఏఎన్ఎంలకు భయోమెట్రిక్ మినహాయించాలి

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం, హెల్త్ సెక్రటరీల ప్రోమోషన్ చానల్స్‌ను అమలు పరచి భయోమెట్రిక్ మినహాయించు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సెక్రటరీస్ జిల్లా కార్యదర్శి ఉషారాణిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 179ప్రకారం మూడేళ్ళు సర్వీసు పూర్తి చేసి డిపార్ట్‌మెంటు పరీక్షలు పాసైన వారందరికి గ్రేడింగ్ మార్చాలన్నారు. నాలుగన్నరేళ్ళు పూర్తి అయిన వారికి గ్రేడింగ్‌మార్చి పేస్కేల్‌ను ఇవ్వాలన్నారు. భయోమెట్రిక్ అటెండెన్స్ మినహాయించు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎంలకు స్టాఫ్‌నర్సులుగా పదోన్నతి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, రంగారెడ్డి, తొలసమ్మ, క్రిష్ణవేణి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

అమర్‌రాజా కంపెనీ వారు ఈనెల 21న ఆదివారం ఉదయం 10గంటలకు పట్టణంలోని ఎన్‌విఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉపాధి అవకాశాల కోసం ఉద్యోగాలు పొందాలన్నారు. దేశంలోనే అమరరాజా కంపెనీకి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయన్నారు. ఈ కంపెనీలో ఉద్యోగం లభిస్తే యువతీ, యువకులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి భవిష్యత్తు

నియోజకవర్గ నాయకులు రెడ్డిసాబ్

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెడిసాబ్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిపారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే కాలానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే వైకాపాను ప్రజలు పక్కన పెట్టారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంతో ప్రజలు విసుగుచెంది రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ఆదరిస్తారన్నారు. ఇటీవల దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో కూడా ఇండియా కూటమి అభ్యర్థులే అధికంగా గెలుపొందడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎస్‌కె.బాషా, మహమ్మద్, మీనాకుమారి, ఈశ్వరమ్మ, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లెక్రైం, జులై 19 ప్రభాతవార్త :

మదనపల్లెలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు రెండవ పట్టణ సిఐ యువరాజు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పిటిఎం మండలం పిడింవారిపల్లెకు చెందిన నాగిరెడ్డి కుమారుడు ఆనందరెడ్డి(41), మదనపల్లె వైఎస్ఆర్ కాలనీలో కాపురం ఉంటూ భార్యలక్ష్మీ ఇద్దరు ఆడపిల్లలని పోషించుకొంటున్నాడు. ఈ క్రమంలో ఏం జరిగిందో ఏమో ప్రతిరోజూ నిద్రించే మిద్దిపైన ఆనందరెడ్డి మోల్డింగ్ కమ్మికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్‌ఆఫ్ బరోడా సౌజన్యంతో విద్యాసామాగ్రి పంపిణీ

మదనపల్లెక్రైం, జులై 19 ప్రభాతవార్త :

బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దిన్తోత్సవం సందర్భంగా అక్షరదాత్రి స్టడి సెంటర్స్‌లోని పేద విద్యార్థులకు విద్యాసామాగ్రిని, వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. దాత్రి పౌండేషన్ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ స్వాతికి ఈ సామాగ్రిలను అందజేశారు. సిఎస్ఆర్ యాక్టివిటి కింద బ్యాంకు అధికారులు విద్యాసామాగ్రిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అనీల్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్‌లు మోహన్, అంజయ్య, రాజేష్, నవీన్, దాత్రి పౌండేషన్ వ్యవస్థాపకరాలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ఆపండి

నాసిరక నిర్మాణాలపై ఎమ్మెల్యే ఆగ్రహం

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

నాసిరకంగా నిర్మాణ పనులు చేపడుతున్న మెడికల్ కళాశాల పనులను తక్షణం ఆపాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేళ్ళ పాటు ఉండాల్సిన మెడికల్ కళాశాల భవనాలు నాసిరకంగా పనులు జరుగుతుండడంతో పదేళ్ళు కూడా ఈ భవనాలు ఉండే పరిస్థితులు లేవని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆరోగ్యవరం సమీపంలోని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా నాసిరకం పిల్లర్లు, నాసిరకం సిమెంటు వాడుతుండడంతో ఇప్పటి వరకు జరిగిన పనులన్నీ చాలా అధ్వాన్నంగా ఉండాయన్నారు. పనులు ఇలానే జరిగితే త్వరలోనే భవనాలు కూలడం తద్యమన్నారు. కట్టడాల పిల్లర్లను, ఇసుకను పరిశీలించి నాణ్యతగా లేదంటూ సంబంధిత ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుకను సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనులన్నీ ఆపి క్వాలిటీ కంట్రోల్ టీమ్ వచ్చి పనులన్నీ పరిశీలించిన తరువాత నాణ్యతగా ఉంటే పనులు చేపట్టాలన్నారు. నాసరిక నిర్మాణాలతో భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ నిర్మాణ పనులన్నీ నాణ్యతగా ఉండేలా సంబంధిత ఇంజనీర్లు చర్యలు తీసుకునేలా ఆదేశించడం జరిగిందన్నారు. పనులు చేపడుతున్న గుత్తేదారుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. నామమాత్రంగా పనులు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇంజనీర్లు కూడా పనులన్నీ క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వినాయక మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించడి - ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :

వినాయక చవితి పండుగరోజు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో వినాయక మట్టి విగ్రహాలకు సంబంధించి డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిల్లో అధికారులు ప్రజలకు మట్టి విగ్రహాలకు సంబంధించి అవగాహన కల్పించామన్నారు. వినాయక విగ్రహాలు తయారు చేసే వారికి కూడా మట్టివిగ్రహాలు తయారు చేయాల్సిందిగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వినాయక చవితి పండుగను జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, తహశీల్దార్ రమాదేవి, సిఐలు, ఎస్ఐలు, ఎంపిడిఓ భానుప్రసాద్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటిశాఖా మంత్రిని కలిసిన శీతప్ప

రామసముద్రం, జులై 19 ప్రభాతవార్త :

రాజంపేట పార్లమెంటు కోశాధికారి సీతప్ప ఐటిశాఖ మంత్రి నారాలోకేష్‌ను శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. మంత్రి సావదానంగా స్పందిస్తూ పార్టీలో కష్టపడిన వారికి సుమచిత స్థానం ఉంటుందని తెలిపారు. నమస్యలపై వారి దృష్టికి తీసుకెళ్ళిడంతో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

శిక్షణా కార్యక్రమం

జమ్మలమడుగు, జులై 19, ప్రభాతవార్త:

జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సముదాయంలో ఉన్న సభా భవన్‌లో పోస్ యాక్ట్ 2013 చట్టంపై జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న మండల అధికారులకు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శ్రీమతి డి.శ్రీలక్ష్మీ వారి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ చట్టం పటిష్టంగా పనిచేయు ప్రభుత్వ ప్రైవేటు మరియు ఇతర సంస్థలలో పనిచేస్తున్న వారు ఇంటర్నల్ పిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని అలాగే ప్రతి 3 నెలలకు ఒక సారి కమిటీ సమావేశం నిర్వహించాలని ఫిర్యాదులుంటే వెంటనే పరిష్కరించాలని తెలియజేయడంతో పాటు ప్రతి సంవత్సరం కమిటీ వార్షిక నివేదికను లోకల్ కంప్లైంట్స్ కమిటీకి నివేదించాలని ఈ కమిటీ 3 సంవత్సరాల కాల పరిమితితో చేస్తుందని చిన్న పిల్లల రక్షణ కొరకై 1098 మరియు మహిళల సమస్యల కొరకై 181, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, సీడీపీవోలు, ఎంఆర్ఓలు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, జులై 19, ప్రభాతవార్త:

వర్షాకాలంలో సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోనంపేట వైద్యాదికారి సిద్దయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏపి మోడల్ స్కూల్ నందు విద్యార్థులకు సీజనల్ వ్యాదులపై అవగాహన కల్పించారు. ఈ వర్షాకాలంలో కలుషృత నీరును తాగడం వలన చాలామందికి విరోచనాలు అవుతున్నాయని నీరును కాచి తాగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా భోజనం ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దోమల వలన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుష్టువ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి చుట్టూ పరిశరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పాతటైర్లు కాళి కొబ్బరిచిప్పలు మురికినీరు లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ కోమటిరెడ్డి, శివశంకర్రెడ్డి సిబ్బంది ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని అధికారులపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, జులై 19, ప్రభాతవార్త:

పట్టణంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ మాట్లాడుతూ శుక్రవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లినప్పుడు అక్కడ కార్యాలయానికి తాళాలు వేసి ఉంచడం గమనార్హం. అటెండరుతో సహా ఫంక్షన్‌కు వెళ్లడం సిగ్గుచేటన్నారు. ఆఫీసుకు అందుబాటులో లేని ఈ అధికారిపై అక్కడి స్టాఫ్‌పై జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకొని ఆయనను విధుల నుంచి తొలగించి అక్కడ స్టాఫ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రెగ్యులర్ ఎంఈవోను కేటటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు లింగమయ్య, చంద్ర, గురుబాబు తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాల ఆస్తులు పరిరక్షణ చేపట్టాలి

లక్కిరెడ్డిపల్లె, జులై 19,ప్రభాతవార్త:

హిందు దేవాలయాల ఆస్తులను పరిరక్షణ చేయాలని బిజేపి నాయకులు కే.కృష్ణ, కె.జయచంద్ర నాయుడులు పేర్కొన్నారు శుక్రవారం విలేకరుల సమావేశంలో ఒకరు మాట్లాడుతూ హిందు దేవాలయాలను మరియు ఆస్తులను పరిరక్షించుకోవాలని కోరారు. గత ప్రభుత్వలాలో ప్రభుత్వం దేవాదాయ శాఖ భూములను, ఆస్తులను దోచుకున్నారు. అంతేకాదు ఆస్తులను బినామీ పేర్ల పై రాయించడం జరిగిందన్నారు. అదే విధంగా తిరుమల దేవస్థానంలో పరిపాలన విభాగం ఇతర మతస్థులకు ఇచ్చి లడ్డు ప్రసాదాలు సరైన నాణ్యత లేకపోవడం భక్తులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం లాంటి కార్యక్రమాలు ఎన్నో జరిగాయి. దేవాదాయ శాఖ భూములు మరియు ఆస్తులపై సమగ్రమైన విచారణ జరిపి ఒక ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి రాజకీయ నాయకులైన వారిని బహిష్కరించి ఒక ప్రత్యేకమైన చట్టం ద్వారా రాజకీయంలో నుంచి తొలగించేలా చూడాలని భావించారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్నటువంటి ధర్మ నీతాధిపతులు, స్వాములు దేవాదాయ శాఖ భూములపై ఆస్తులపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితం కావాలి

నందలూరు,జులై 19,ప్రభాతవార్త:

నందలూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపిపి మేడా విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సమావేశంనకు రాజంపేట నియోజకవర్గ శాసన సభ్యులు అకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న అధికారులు తమ శాఖ వరంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేయాలన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఉండే వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ చంద్రకళ మాట్లాడుతూ జిల్లా లోని మహిళా సమస్యల కోసం ప్రభుత్వం ఉచితం సలహాలు, సహాయం అందిస్తుందని వీటిని అవసరం అయినా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. మండల వైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న వాతావరణానికి అనుగుణంగా ఆరోగ్య కేంద్రం నందు ప్రతిరోజు పరీక్షలు నిర్వహిస్తూ. సరిపడ్డ మందులు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ఉపాధి,విద్యుత్,ఎడ్యుకేషన్ మరియు వివిధ శృాఖల అధికారులు తమ విధులో చేసే పనులను నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రిని కలసిన మైనార్టీ నాయకులు

కురబలకోట, జులై 19 ప్రభాతవార్త :

రాష్ట్ర ఐటిశాఖా మంత్రి నారా లోకేష్‌ను కురబలకోట మండల మైనార్టీ నాయకులు ఎస్.షామీర్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలో షామీర్‌బాషా కలసి పుష్పగుచ్చం అందజేసి శాలువ కప్పారు. అనంతరం తంబళ్ళపల్లె నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని పార్టీకోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర హోంమంత్రి అనితను షామీర్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో తంబళ్ళపల్లె నియోజకవర్గంలో జరిగిన పలు ఘటనల్లో టిడిపి శ్రేణులపై అక్రమ కేసులు బనాయించారని వాటిని ఎత్తివేసేందుకు చొరవ చూపాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించనట్లు ఆయన తెలిపారు.

నివాళులు అర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జులై 19(ప్రభాతవార్త):

మండల కేంద్రంలోని పలు సంతాప కార్యక్రమాల్లో రాష్ట్ర క్రీడా, రవాణా, యువజన శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు కేడెం లక్ష్మయ్య సోదరుడు కేడెం జయరాం దశదినకర్మ కాండ కార్యక్రమంలో పాల్గొని సంతాపం ప్రకటించారు. అనంతరం పక్కిరారెడ్డిగారిపల్లెలో ఉంటున్న టీడీపీ నాయకులు హేమకుమార్‌రెడ్డి కుమారుడు భౌతికకాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్ర వాల్మీకి సంఘం యూత్ వింగ్ అధ్యక్షులుగా బండి వెంకటసాయి పరశురాం

గాలివీడు, జులై 19(ప్రభాతవార్త):

రాష్ట్ర వాల్మీకి సంఘం యూత్ వింగ్ అధ్యక్షులుగా బండి వెంకటసాయి పరశురాంను నియమించినట్లు రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన వెంకటసాయి పరశురాంకి రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుల నుండి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌విఎస్ఎస్ విధి విధానాలకు లోబడి వాల్మీకి బోయల ఎస్టీ పునరుద్ధరణ అంశం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. బండి వెంకటసాయి పరశురాం తన నియామకం పట్ల స్పందిస్తూ తనపై నమ్మకం ఉంచి నాకు ఇచ్చినటువంటి బాధ్యతను జాతి యొక్క అభ్యున్నతికి నా శక్తి మేర కృషి చేస్తానని వాల్మీకి బోయలు సామాజిక ఆర్థిక రాజకీయపరంగా అభివృద్ధి చెందాలంటే ఎస్టీ పునరుద్ధరణతోనే సాధ్యమని ఎస్టీ సాధనకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువతను మేలుకొలుపుతూ ఉద్యమంలో ఎక్కువ మందిని పాలుపంచుకునే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మోహన, జాయింట్ సెక్రటరీ ఆనంద్, అధికారి ప్రతినిధి మేకల శివప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జమాలుల్లా బాబా దర్గాలో మంత్రి ప్రత్యేక ప్రార్థనలు

రాయచోటి, జులై 19, ప్రభాతవార్త:

రొట్టెల పండగ సందర్భంగా దర్గా వద్దకు విచ్చేసిన ఏపీ రాష్ట్ర రవాణా యువజన క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈద్గా వెనక ఉన్న దర్గాలో దర్గా మౌలిసాబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన మహిళలు సమస్యల గురించి విన్నవించారు. సమస్యలను పరిష్కరిస్తానని ఆయన మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, మైనార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రక్త వారోత్సవాలు స్వచ్ఛంద సేవా సంస్థలు, నెహ్రూ యువ కేంద్రం

కడప వైద్యవిభాగం, జులై 19, ప్రభాతవార్త:

కడప జిల్లాలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు మరియు నెహ్రూ యువ కకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు రక్త వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛంద సేవవా సంస్థల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాకాల ప్రభావం వలన డెంగీ, మలేరియా ఇతర విషపూరిత జ్వరాల వల్ల అస్వస్తత పరిస్థితిలో ఉన్న వారికి రక్తం ఎక్కించడానికి నిల్వలు తక్కువ ఉన్నాయని దీన్ని దృష్టిలో ఉంచుకొని యువకులు, ఉద్యోగులు, వ్యాపారులు ప్రతి ఒక్కరూ ఈ రక్త వారోత్సవాల్లో పాల్గొని రక్తదాన శిబిరాల్లో రక్తదానం చేసి జయప్రదం చేయాల్సిందిగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠ అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌డీసీ ప్రధాన మంత్రి విశ్వకర్తలో శిక్షణ నైపుణ్యం

కడప వైద్యవిభాగం, జులై 19, ప్రభాతవార్త:

ఎన్ఎస్‌డీసీ ప్రధాన మంత్రి విశ్వకర్మ నైపుణ్యం ఉచిత శిక్షణ కార్యక్రమం కడప నగరం అల్మాస్‌పేటలో ఎస్.కె.అంజుమ్ ఆధ్వర్యంలో జరగడం చాలా శుభ పరిణామమని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ నైపుణ్య శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. కడప సెంటర్ మేనేజర్ అంజుమ్ మాట్లాడుతూ ఎన్ఎస్‌డీఎస్‌సీ ప్రధాన మంత్రి కర్మ యోజన నైపుణ్య శిక్షణలో శిక్షణ పొందిన వారికి కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ద్వారా సర్టిఫికెట్లు అందజేయడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, ఫాహీమ్, ముస్కాన్, హరినాథ్, నయీం, ఇంతియాజ్, నవీద, ఆర్బాజ్, శిరీషా, యాస్మిన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, నియామకాలు

కడప వైద్యవిభాగం, జులై 19, ప్రభాతవార్త:

అల్మాస్‌పేటలోని పీఎంకేకే కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శిక్షణ కేంద్రంలో సింక్రోసర్వ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీ, డిప్లొమో, గ్రాడ్యుయేట్ యువతీ యువకులుకు ఉన్నతంగా డివోప్స్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఐఓయ్, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కడప సెంటర్ మేనేజర్ ఎస్.కె.అంజుమ్ తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగ, యువత, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9281042749, 63018 51535 సంప్రదించాలని కోరారు.

ఆస్థి పంచలేదని తండ్రిని హత్య చేశాడు

మదనపల్లెక్రైం, జులై 19 ప్రభాతవార్త :

ఆస్థిలో వాటా పంచలేదని కన్నకొడుకే కారుతో తండ్రిని గుద్ది చంపేశాడని డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐ యువరాజ్, ఎస్ఐ వెంకటసుబ్బయ్యలు తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలన

కలికిరి జేసీ సుడిగాలి పర్యటన

కలికిరి, జులై 19, ప్రభాతవార్త:

కలికిరి మండలంలో శుక్రవారం అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ షేక్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థినిలకు వడ్డిస్తున్న భోజనంపై ఆరా తీసి విద్యార్థినిలతో సహపంక్తి భోజనం చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై జేసీ ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం కలికిరి సచివాలయం-1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ సచివాలయం నుంచి అందించే సేవలపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు సకాలంలో అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మర్రికుంటపల్లె గ్రామ సచివాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం నుంచి కులం సర్టిఫికెట్లు ఎలా అప్‌లోడ్ చేస్తున్నారు అనే అంశంపై ఆరా తీసి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల నుంచి కులం సర్టిఫికెట్లు మంజూరు కాలేదు. వాటిని ప్రభుత్వం సుమోటోగా స్వీకరించి కులం సర్టిఫికెట్లపై తనిఖీ చేసి మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. దీనిపై జేసీ కలికిరి మండలంలోని సచివాలయాలను సందర్శించి కులం సర్టిఫికెట్లపై పరిశీలించి త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కలికిరి మండలంలో సచివాలయ సిబ్బంది, బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు అందించే భోజన వసతిపై అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలికిరి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థినిలకు ఇస్కాన్ నుంచి సరఫరా అవుతున్న భోజనం సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం సరిగా లేక విద్యార్థులు తినకుండా వదిలేయడం గుర్తించారు. రాబోయే రోజుల్లో కలికిరి బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు కూడా నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటామని జేసీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణయ్య, తహసీల్దారు విజయకుమారి, కలికిరి పంచాయతీ ఈవో గురుమోహన్, మర్రికుంటపల్లె పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఎంఈవోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగిఉండాలి

ప్రొద్దుటూరు, జూలై 19, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహణ కలిగి ఉండాలని మున్సిపల్ కమీషనర్ రఘునాథ రెడ్డి తెలిపారు. స్థానిక సాయికుటీర్ రోడ్డులోని గౌతమ్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన సీజనల్ వ్యాధులు మరియు స్టాప్ డయేరియాపై విధ్యార్థులకు ఆయన అవగాహణ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జూన్ నుండి నవంబర్ వరకు వర్శాకాలం కావడంతో నీరు నిలువ ఉండే అవకాశం ఉందన్నారు. దీనివల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని వాటి వలన మలేరియా, డెంయ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, బోధకాలే మొదలగు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాలంటే దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించి అన్ని నీటి నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. నీటిలో ఉన్న లార్వాను పారయించాలని నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. అలాగే ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పనికిరాని తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు మొదలు వాటిని లేకుండా చేసుకోవాలని తెలిపారు. దోమల నుండి రక్షణ పొందుటకు దోమతెరలు వాడాలని జ్వరం వస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేసుకొని తగిన చికిత్స తీసుకొని ఆరోగ్యంగా జీవనం కొనసాగించాలన్నారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ స్టాప్ డయేరియా గురించి వివరిస్తూ పిల్లలను బేదులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పరిశుభ్రమైన నీటిని తాగాలని అన్ని రకాల ఆహార పధార్థాల పైన ఈగలు వాళకుండా మూతలు పెట్టుకోవాలని బజారులో విక్రయించే పానిపూరి వంటిని తినకూడదని పిల్లల్లో డయేరియా ఉందేమో గుర్తించి వారికి ఓఆర్ఎస్ మరియు జింక్ మాత్రలు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మౌనిక, స్కూల్ డైరెక్టర్ మునిస్వామి నాయుడు, ప్రధానోపాధ్యాయులు ప్రభావతి దేవి, డిపిఎమ్ఓ శివ శంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్స్పెక్టర్ నూర్ బాషా, గోవిందరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్, సచివాలయం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా బాధితులను పరామర్శించిన పెరుగు వీరనారాయణ

చాపాడు, జూలై 19, ప్రభాతవార్త:

మండలంలోని అల్లాడుపల్లె గ్రామ పంచాయతీలో డయేరియాతో ప్రొద్దుటూరులోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను శుక్రవారం ఎంఎల్ఎన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ పెరుగు వీరనారాయణ యాదవ్ పరామర్శించారు. ఈ సంధర్భంగా ఆయన ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరినట్లు తెలిపారు.

వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం

ముద్దనూరు, జూలై 19, ప్రభాతవార్త:

ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైధ్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, సీహెచ్ఓ, ఆశా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీకాంత్ సీజనల్ వ్యాధులు, లెప్రసీ, కుష్టువ్యాధి, డయేరియా వ్యాధులు వాటి లక్షణాలు, చికిత్స మొదలైన విశయాలపై చర్చించారు. కుష్టు వ్యాధి సర్వేలో ప్రతి ఆశా ప్రతి ఇంటిని సర్వే చేసి సస్పెక్టెడ్ కేసులను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 18-07-2024 నుండి 02-08-2024 వరకు 14 రోజుల పాటు ప్రతి గ్రామంలోని గృహాలను సర్వే చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు అయిన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే విధంగా ప్రజలను చైతన్య పరచాలని డాక్టర్ శ్రీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసురెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శోభాకుమారి, హెల్త్ అసిస్టెంట్ నరసయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తాం

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 19, ప్రభాతవార్త:

టిడిపి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు అయిన దృష్ట్యా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయుటకు ప్రయత్నిస్తున్నామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కోండారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన కాలువలను 136కోట్ల రూపాయలతో ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. శుక్రవారం స్థానిక నెహూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరులోని ప్రధాన కాలువలను 136కోట్ల రూపాయలతో ఆధునీకరణ చేపట్టబోతున్నామని వివరించారు. భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా ఈ పనులు చేపడతామని స్పష్టం చేశారు. కూరగాయల మార్కెట్ ప్లాన్ బాగుంది పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. బంగారు అంగళ్ల మధ్య ఉన్న త్రాగునీరు ట్యాంక్ వాడుకుంటూ మరొక ట్యాంక్ ఏర్పాటు చేస్తామని, అభివృద్ధి పనులు అనుకున్న సమయానికి పూర్తి అయ్యేలా కష్టపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

సంబేపల్లె, జులై 19, ప్రభాతవార్త:

విద్యార్థులు చిన్ననాటి నుంచే వినూత్నంగా ఆలోచించే విధానాన్ని పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రాజెక్టుల ప్రదర్శన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇతరులతో పోటీ పడి బాగా చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విజయభాస్కర్, దేవప్రసాద్‌రెడ్డి, జోసెఫ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బిజెపిలో చేరిన ఎస్వీడీసీ అధినేత హరినారాయణ

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి

ప్రొద్దుటూరు, జూలై 19, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల అధినేత అరకటవేముల హరి నారాయణ బిజెపిలో చేరారు. శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు శశి భూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్ రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కో కన్వీనర్ గౌరిశంకర్, భాను ప్రకాష్ రాష్ట్ర సంస్కృతిక శాఖ కన్వీనర్ ఆధ్వర్యంలో బీజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు పురంధరేశ్వరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీల అభివృద్ధికి హరి నారాయణ తోకలిసి పనిచేయాలని జిల్లా నేతలకు ఆమె సూచించారు. ఈ సంధర్భంగా హరి నారాయణ మాట్లాడుతూ బీజేపి అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పధకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రొద్దుటూరు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో కలికిరి పంచాయతీకి కళ

పీలేరు, జూలై 18 ప్రభాతవార్తః

పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో కలికిరి దివంగత సర్పంచి రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డి కుమారుడు యోగేష్‌రెడ్డి చొరవతో విద్యుత్ దీపాలకు మోక్షం కలిగింది. మేజర్ పంచాయతీ కలికిరిలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో యువకుడు యోగేష్‌రెడ్డి కలికిరి పట్టణంలోని రెడ్డివారిపల్లె నుంచి ప్రసాద్ థియేటర్, టీబీ రోడ్డు లలోనే కాకుండా పట్టణంలో వీధి దీపాలకు మోక్షం కలిగింది. సర్పంచి మరణంతో కలికిరి పట్టణంలో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. అయితే ప్రజా సమస్యల పరిష్కరించడంలో భాగంగా తండ్రి చేసిన అభివద్ధి బాటలోనే తనయుడు కూడా చేయాలని భావించి పంచాయతీ ఈఓ గురుప్రసాద్‌తో చర్చించడమే కాకుండా పట్టణంలో అభివద్ధికి బాటలు వేస్తుండటం చూస్తే మరింత అభివద్ధి చేందేందుకు కషిచేస్తారని తెలుస్తుంది. మేజర్ పంచాయతీ కలికిరి ఈఓ గురుప్రసాద్ సహకారంతో కలికిరి పట్టణం మరింత అభివద్ధి చెందేందుకు కషిచేస్తామని ఈఓ గురుమోహన్, యువ నాయకులు యోగేష్‌రెడ్డిలు తెలిపారు.

విద్యుత్ అంతరాయాలను కలగకుండా చూడాలి

-ప్రమాదాలు జరగకుండా నివారణ చేయాలి -ఉమ్మడి జిల్లా సూపర్డెంట్ ఇంజనీర్ రమణ

లక్కిరెడ్డిపల్లె, జులై 19, ప్రభాతవార్త:

విద్యుత్ అంతరాయాలు కలగకుండా చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లాల విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీ ఎస్ రమణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 33/11 కె.వి మద్దిరేవుల సబ్స్టేషన్ ట్రాన్సాఫర్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి, రామాపురం మండలాల అధికారులు మరియు సిబ్బంధితో పామవేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులతో వాట్సాఆప్ గ్రూపులను ఏర్పాటు చేసి వారి విద్యుత్ సమస్యలను పరిష్కరించి సంస్థపై వారి సంతృప్తికర స్థాయిని పెంచే విధంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఆదేశించారు...లైన్లతో తరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మత్తులు చేసి అంతరాయలను అరికట్టి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని సిబ్బందిని ఆదేశించారు లోవోల్టేజి సమస్యలు తెలత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్సాఫర్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోండి వర్శాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచుటలో భాగంగా విద్యుత్ స్తంభాలను తాకకుండా, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా మరమ్మత్తులు విద్యుత్ శాఖ సిబ్బందితో చేయించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించుటకు వార్తపత్రికల ద్వారా, లోకల్ టీవిల ద్వారా ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని తెలియజేశ్శారు. రైతు దేశానికీ వెన్నుముక లాంటి వారు..రైతుల విద్యుత్ సమస్యలపై అధిక ప్రాధాన్యతతో దృష్టి సారించాలి...రైతుల విద్యుత్ సమస్యలైన ట్రాన్స్ఫార్మర్ ఫీజులు వేయడం,కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లు మార్చడం వంటి తదితర పనులపై వెంటనే స్పందించండి వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధకారులు వారితో మమేకమై మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో లక్కిరెడ్డిపల్లె డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామచంద్ర రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ హరినాథ్, ఎఇలు, జేఈలు, అకౌంట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో అన్యాక్రాంతమైన దేవాదాయశాఖకు చెందిన 42 ఎకరాల మాన్యం భూములకు మోక్షం

సంబేపల్లె, జులై 19, ప్రభాతవార్త:

రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో అన్యాక్రాంతమైన దేవాదాయశాఖకు చెందిన 42 ఎకరాల మాన్యం భూములకు మోక్షం వచ్చింది. అన్నమ య్య జిల్లా సంబేపల్లి మండలం దేవపట్ల రెవె న్యూ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా వైకాపా నాయ కుల ఆధీనంలో ఉన్న ఆలయ మాన్యం భూము లను ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని సర్వే నంబరు 330లో 37.06 ఎకరా లు, సర్వే నెంబరు 506లో 4.28 ఎకరాలు, సర్వే నెంబరు 570లో 0.5 ఎకరాల మాన్యం భూములను సరిహద్దులు నిర్ణయించి శుక్రవారం దేవాదాయశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. వైకా పా నాయకుల ఆధీనంలో ఉన్న మరికొన్ని భూములను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధి కారుల బృందం విచారణ చేపట్టింది. త్వరలోనే మరిన్ని భూములు ప్రభుత్వానికి స్వాధీనం కానున్నాయి.

ప్రాచీన కళ కోలాటాన్ని ప్రాచుర్యంలోకి తేవడం ప్రశంసనీయం

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 19, ప్రభాతవార్త:

ప్రాచీన కళ కోలాటాన్ని ప్రాచూర్యంలోకి తేవడం ప్రశంసనీయమని వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక బొల్లవరంలోని గోల్డెన్ పార్క్ నందు ప్రొద్దుటూరుకు చెందిన సావిత్రి బాయి పూలే కోలాట బృందం వారు బండి మల్లిక, సాయి భరత్ మాష్టర్ ఆధ్వర్యంలో ద్వారకా తిరుమలలో 222మందితో దశావతారాలు జానపద కోలాట నృత్యం చేసి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందినందుకు గాను అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా విశిష్ట అతిధి కలెక్టర్ లోతేటి శివశంకర్ పాల్గొని మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే కోలాట బృందం వారి నృత్య ప్రదర్శన అద్భుతం అన్నారు. నేటి డిజిట్ యుగంలో కూడ ప్రాచీన కళ కోలాటాన్ని ప్రాచూర్యంలోకి తేవడానికి ఈ బృందం సేవలు అభినందనీయం అని ప్రశంసించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈ కోలాట నృత్యానికి పూర్వ వైభవం తెచ్చారని, తాను జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత పాల్గొన్న తొలి కార్యక్రమం అని, తనకు గుర్తుండిపోతుందని వివరించారు. అనంతరం ముఖ్య అతిధి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఖ్యాతిని అనుమడింప చేసిన కోలాట బృందానికి అభినందనలు తెలిపారు. భావితరాల వారికి ఈ కళను పరిచయం చేయాల్సిన బాధ్యత బృందం సభ్యులపై ఉందన్నారు. అనంతరం కళాకారుడు దావూద్ మాట్లాడుతూ తాను కళాకారుడిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని, ఈ బృందం కళాకారుల నిబద్ధత ప్రశంసనీయం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ బృందం సభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మురళీధర్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, కమీషనర్ రఘునాథ రెడ్డి, కృష్ణాలయం కమిటి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్, మోయిద్దీన్ ఖాన్, రామకృష్ణ బాబు, యడవల్లి రమణయ్య, టిడిపి నాయకులు తోట మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటలలో క్రీడాకారులు రాణించాలి

కడప కార్పొరేషన్, జులై 19, ప్రభాతవార్త:

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సెక్రటరీ, స్పోర్ట్స్ బోర్డు, వైవీయూ రామసుబ్బారెడ్డి అన్నారు. కడప డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ బీచ్ కబడి బాల బాలికల సెలక్షన్లు శుక్రవారం కడప వైవీయూలో జరిగాయి. 70 మంది బాల బాలికలు ఈ సెలక్షన్‌లో పాల్గొన్నారు. ముఖ్య అతిథి కె.రామసుబ్బారెడ్డి, విశిష్ట అతిథి డా.రామచంద్రారెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చక్కటి వాతావరణంలో బీచ్ కబడ్డీ సెలక్షన్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ సెక్రటరీ శ్రీవాణి, ఎస్‌జీపీ సెక్రటరీ అరుణ్‌కుమారి, కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రారెడ్డి, డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్.వి.శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సునీల్, సీనియర్ ప్లేయర్ గిరి, నరేష్, నిత్య ప్రభాకర్, పీఓ సుబ్బన్న, ఆర్గనైజర్ అరుణ, బీచ్ కబడ్డీ ప్లేయర్లు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు

కడప కార్పొరేషన్, జులై 19, ప్రభాతవార్త:

బీచ్ కబడ్డీ పోటీలో ఎంపికైన బాల బాలికలకు డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్.వి.శ్రీధర్ అభినందనలు తెలిపారు. కడప డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ బీచ్ కబడ్డీ బాల బాలికల ఎంపికలు శుక్రవారం కడప వైవీయూలో జరిగాయి. 70 మంది బాల బాలికలు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ సెక్రటరీ శ్రీవాణి, ఎస్‌జీపీ సెక్రటరీ అరుణ్‌కుమారి, కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రారెడ్డి, డీఎస్ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సునీల్, సీనియర్ ప్లేయర్ గిరి, నరేష్, నిత్య ప్రభాకర్, పీవో సుబ్బన్న, ఆర్గనైజర్ అరుణ, బీచ్ కబడ్డీ ప్లేయర్లు పాల్గొన్నారు.

10మంది గర్భిణీలకు స్కానింగ్

ముద్దనూరు, జూలై 19, ప్రభాతవార్త:

ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నాడు స్కానింగ్ మిషన్‌ను డాక్టర్ సుచరిత(జమ్మలమడుగు) ఆధ్వర్యంలో ఓపెనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా 10మంది గర్భిణీ స్త్రీలకు డాక్టర్ సుచరిత స్కానింగ్ చేసి వారి ఆరోగ్య స్థితిని పరీక్షించారు. గర్భస్త శిశువు పొజిషన్ ఎలా ఉంది బిడ్డ ఆరోగ్య స్థితిగతులు పరీక్ష చేసి వారికి రిపోర్ట్‌లను ఇచ్చారు. డాక్టర్ సుచరిత మాట్లాడుతూ ప్రతి పేద గర్భిణీ స్త్రీకి ఈ స్కానింగ్ ఎంతో ఉపయోగపడుతుందని, ముద్దనూరు పరిసరాల గర్భిణీ స్త్రీలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుచరిత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శోభాకుమారి, స్టాఫ్ నర్స్ రమాదేవి, ఆశా కార్యకర్తలు చంద్రా భాయ్, భారతి, గర్భిణీలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటి బ్యాంకుల జాతీయకరణ వార్శికోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 19, ప్రభాతవార్త:

1969 సంవత్సరంలో జరిగిన 14బ్యాంకుల జాతీయికరణ జరిగి శుక్రవారంతో 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం గా శుక్రవారం ప్రొద్దుటూరు బ్యాంక్ ఎం ప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటి బ్యాంకుల జాతీయకరణ వార్శికోత్సవాన్ని స్థానిక డిసిసి బ్యాంక్ నందు నిర్వహించారు. ఈ సంధ ర్భంగా సభ్యులకు మొక్కల పంపిణీ చేశారు. అనంతరం బ్యాంక్ మిటి సభ్యులు మాట్లాడుతూ గత 55ఏళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సామాన్యులకు మరియు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు దేశ నిర్మాణ సంస్థలు అని అలాగే ఉండాలని, సామాన్య ప్రజల విలువైన పొదుపుతో వ్యవహరించే ఈ బ్యాంకులను ప్రైవే టీకరించడం ప్రజా వ్యతిరేక చర్య అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుధాకర్, ప్రవీణ్, సంతోష్, చైతన్య, సుభాన్, రాధమ్మ, సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.